

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

**– డా. నందమూరి లక్ష్మీపార్వతి**



డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం **'ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు – భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ'** నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు – కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!

## (గత సంచిక తరువాయి)

**తన్నెదిరించిన** బాలుని జీవసమాధి చేయిస్తాడు అవివేకియైన హరిహర మహారాజు. అతడి మూర్ఖత్వాన్ని విష్ణువునకు చెబుతాడు నారదుడు. అతడు మూర్ఖభక్తుడు. అతనినెలా శిక్షించగలను అమలిన సత్యదీక్ష వ్రతమాచరింపదలచి.. వారికి అమందానందం దొరుకుతుందని చెబుతాడు. సత్యదేవుడు నారదుడికి స్వయంగా ఆ వ్రతవిధానం చెబుతాడు. నారదుడు బాలుడికి నారాయణ మంత్రం ఉపదేశించి బంధనాలు తొలగిస్తాడు. ఆ బాలుడే సత్యదాసు. అతడు అనేక అద్భుతాలు చేస్తూ ప్రజలందరిని మంచి మార్గంలో నడిపిస్తుంటాడు. రాజకుమార్తె రత్నావళి సత్యదాసుని ప్రేమిస్తుంది. కపట ఉపాయంతో రాజు సత్యదాసుని పిలిపించి పడమటి కొండల్లో బంధిస్తాడు. నారదుడి మాయోపాయంవల్ల రాజు దగ్గరున్న మంత్రి తానే దైవమని ప్రకటించుకుని రాజును బందీ చేస్తాడు. సత్యదాసు సత్యదేవుని ప్రార్థిస్తాడు. 'మాధవా! మౌనమా సనాతనా ' అనే ఈపాట ఒక్కటే పేరు తెచ్చుకుంది. నారాయణుడు ప్రత్యక్షమౌతాడు. అప్పటి రూపం దివ్యమనోహరతను భాసింపచేస్తోంది. 'భక్తా! సత్యదాసా ' అన్న మాటలో వాత్సల్యం పొంగులు వారుతుంది. ఆ పిలుపులో అలా మృదుగంభీరతను పలికించగలగడం శైలిలోని ప్రత్యేకత.

'స్వామీ! నన్ను కరుణించారా. ప్రభూ! లోకానికి వెలుగునిచ్చే ప్రభువు. ఈ అంధుడికి వెలుగునివ్వలేవా. నీ దివ్యరూపం సందర్శించే భాగ్యం ప్రసాదించండి. ' భక్తుడిగా ఆవేదన భగవంతుడిగా అభిమానం, రెండూ తనే అయినా స్వరంలో విభిన్న ధ్వనులు పాత్రలను వేరుపరుస్తున్నాయి.

'నాయనా! సత్యదాసూ! ఈ ప్రకృతి స్వరూపమే నీవు. సృష్టి స్థితి లయ కారుడను నేను. ప్రకృతి స్వరూపాన్ని తిలకించు ' అని దృష్టిని ప్రసాదిస్తాడు.

సత్యదాసు పాత్ర పాండురంగ మహాత్మ్యంలో పుండరీకుడి వేషంలాగానే ఉంది. చివరకు భక్తుడి కోరిక మీద విష్ణువు అక్కడే ఉండిపోతాడు. లక్ష్మి, భూదేవి ఇరువురు కలిసి ప్రార్థిస్తారు. నేనీ భక్తుడికి దాసుడిని. ఇతనిని విడచి రాలేను. అని స్వామి చెబుతాడు. అప్పుడు సత్యదాసు 'అసలు స్వామిని మీరు తీసుకెళ్ళండి. ఛాయారూపం ఇక్కడుంటే చాలు ' అంటాడు. స్వామి అక్కడ విగ్రహంగా వెలుస్తాడు. నారదుడి ఆదేశం మేరకు సత్యదాసు రత్నావళిని వివాహం చేసుకుంటాడు.

*సత్యహరిశ్చంద్ర*

1965లో కె.వి.రెడ్డిగారి దర్శక నిర్మాతగా సత్యహరిశ్చంద్ర చిత్రం విడుదలైంది. షట్చక్రవర్తుల్లో ఒకనిగా సత్యానికి మారు స్వరూపుడిగా అనేక చోట్ల భిన్నభిన్నంగా వర్ణితమైన హరిశ్చంద్ర కథను పరిష్కరించిన గౌరన రచించిన హరిశ్చంద్రోపాఖ్యానం సుప్రసిద్ధం. ఆ కథారూపాన్నే ప్రధానంగా అనుసరిస్తూ బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు రాసిన సత్యహరిశ్చంద్ర నాటకం తెలుగు నాటక చరిత్రలోని అనర్ఘమణుల్లో ఒకటి. అత్యంత ప్రభావం పొందిన నాటకం. తరాలుగా యుగాలుగా భారతీయ సాహిత్య సంస్కృతుల్లో శాశ్వతంగా మిగిలిపోయిన పాత్ర హరిశ్చంద్రునిది.

హరిశ్చంద్రుడు వేదవాఙ్మయకాలం నుంచి ప్రస్తావితమైన పాత్ర. ఆయన చరిత్ర ప్రధానంగా మార్కండేయ పురాణంలో చెప్పబడింది.

''భవద్భిరిదమాఖ్యాతం యథాప్రశ్నమనుక్రమాత్

మహత్కౌతూహలం మేస్తి హరిశ్చంద్రకథాంప్రతి -

ఎనిమిదవ అధ్యాయం - హరిశ్చంద్రోపాఖ్యానం, శ్రీ మార్కండేయ పురాణం - 37వ పేజీ.

హరిశ్చంద్రేతి రాజర్షి రాసీత్త్రేతా యుగేపురా

ధర్మాత్మా పృథివీపాలః ప్రోల్లసత్కీర్తిరుత్తమః -

1వ శ్లో 6వ అధ్యాయం - మా.పు. 31 పేజీ

కనుక అయోధ్యను పాలించే రాజు హరిశ్చంద్రుడని పురాణాంతర్గతమైన కథ ఉంది. అయితే, ఈ పురాణంలో హరిశ్చంద్రుడి భార్యపేరు, శైబ్యాదేవి కుమారుడు లోహితాస్యుడు. విశ్వామిత్రుడు తన రాజ్యమపహరించడంతో అడవి పాలై చివరికి భార్యను తనను అమ్ముకుని కొడుకు మరణంతో దుఃఖితులై భార్యాభర్తలిద్దరూ అగ్నిప్రవేశము చేయబోగా ధర్మదేవత, ఇంద్రుడు తక్కిన దేవతలు వచ్చి అతనిని స్వర్గమునకు రమ్మని అడగగా తన ప్రజలు వస్తే తాను కూడా వస్తానని చెప్పినట్లు, ఇంద్రుడు ఒప్పుకుని అనేక విమానములను సమకూర్చి అయోధ్య పురప్రజలందరిని స్వర్గానికి తీసుకెళ్ళినట్లు మార్కండేయ పురాణ కథ వర్ణిస్తుంది. దీనికి కొంత భిన్నంగా హరిశ్చంద్రోపాఖ్యాన కథ ప్రచారంలోకి వచ్చింది. దీనిని తీసుకుని నాటకం తర్వాత దానిపై ఆధారపడి చిత్రాలు వచ్చాయి. మొత్తంపై తెలుగునాట ప్రచారంలో ఉన్నది. బలిజేపల్లి కవిగారి నాటక కథ.

హరిశ్చంద్రుని కుటుంబం పార్వతీ పరమేశ్వరులను పూజించటంతో చిత్రం మొదలవుతుంది. యజ్ఞఫలంగా వచ్చిన మణిని ప్రజలందరి శ్రేయస్సు కోసం సభలో ఉంచుతారు. అప్పుడొక దివ్యముని వచ్చి అది తనకు దానం చేయమంటాడు. ''నీవడిగినదేది కాని ఇవ్వదగినది ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నాను'' హరిశ్చంద్రుడంటాడు. వచ్చినవాడు మహేశ్వరుడని వశిష్ఠుడు గ్రహిస్తాడు.

హరిశ్చంద్ర పాత్రకు తగిన పూర్తి సహనశీలతను రామారావుగారు బాగా నటించారు. అత్యంత ఓరిమి, ధర్మం పట్ల దైవం పట్ల విశ్వాసంతో ప్రజలను కన్నబిడ్డల్లా పాలిస్తూ ఏకపత్నీవ్రతంతో సత్యనిష్ఠుడైన మహారాజుగా రామారావుగారు బాగానే నప్పారు. కాని ఆహార్యం కొన్ని చోట్ల ఏదో ఇబ్బందిగానే కనిపిస్తుంది. దుస్తులు, కిరీటం కొన్ని సమయాల్లో రాజుకు తగినట్లుకాక భటుడు వేషంలాగుంది. ఎందుకో అంత ఆర్ద్రత కలగదు. రాజు అరణ్యంలో ప్రవేశించిన దగ్గరనుండి కొంతవరకు బాగానే ఉన్నా ఏ సన్నివేశం ప్రేక్షకుల్ని కరుణరసార్ద్రం చెయ్యలేదు. అందుకే ఈ చిత్రం విజయవంతం కాలేదు. అంతకుమునుపు రంగారావుగారు హరిశ్చంద్రునిగా, లక్ష్మీరాజ్యంగారు చంద్రమతిగా వచ్చిన రాజ్యం ప్రొడక్షన్స్ వారి హరిశ్చంద్ర చిత్రం మంచిపేరు తెచ్చుకుంది. దాంతో పోల్చితే ఈ చిత్రం తేలిపోతుంది. చంద్రమతి పాత్రధారిణిగా ఎస్. వరలక్ష్మిగారు బాగానే ఉన్నా చిత్రాల్లో అగుపించే సహజతకంటే మించి నాటకాల్లోని నటిగానే కనిపించారు.

ఇంద్రలోకంలో సత్యాన్ని గురించి వచ్చిన ప్రసంగం పంతాలకు దారితీసి విశ్వామిత్రుడు వశిష్ఠుడు ప్రతిజ్ఞలు చేసుకునే వరకు వస్తుంది. త్రికరణశుద్ధి కలిగిన సత్యముని పాటించుట సాధ్యము కాదు అని విశ్వామిత్రుడు వాదిస్తాడు. ధర్మజ్ఞులేకొన్ని విషయాల్లో అబద్ధమాడవచ్చని చెప్పారని చెబుతాడు. వైవాహికములందు, వారిజాక్షులందు, ప్రాణమానవిత్తములందు, పలికి బొంకవచ్చు. వారి పందానికి హరిశ్చంద్రుని జీవితాన్ని బలిచేస్తారు. రాబోయే విపత్తులకు గుర్తుగా చంద్రమతికి చెడ్డకల వస్తుంది.

నిరంతరం దానవ్రతుడైన చక్రవర్తికి విశ్వామిత్రుడు శిష్యునితో సహా వచ్చి ఒక ఏనుగు మీద బలవంతుడొక్కడు నిల్చి రత్నమును పైకి విసిరితే ఎంత ఎత్తుకు పోతుందో అంత ఎత్తున ధనరాశి కావాలని అడుగుతాడు. చక్రవర్తి సంతోషంగా తీసుకుని వెళ్ళమంటాడు. అవసరమైనప్పుడు తీసుకుంటానని వెళ్ళిపోతాడు.

విశ్వామిత్రుడు సృష్టించిన మాయా మృగాలను వేటాడి అలసిపోయిన మహారాజు దగ్గరకు విశ్వామిత్రుడి కన్యలిద్దరు వచ్చి పెళ్ళిచేసుకొమ్మంటారు. అప్పుడు రాజు "బాలికులారా! మీ కిట్టి కోరిక తగదు. వెళ్ళండి.. బహుమానాలందండి" అని చెప్పినా వినరు. అందరూ విశ్వామిత్రుడి ఆశ్రమానికి వెళ్తారు. తన కుమార్తెలను వివాహమాడమని విశ్వామిత్రుడు బలవంతం చేస్తాడు. రాజు సమ్మతింపక "బ్రహ్మర్షిసత్తమా! ఈ బాలికలు అసభ్యముగా ప్రవర్తించిరి. వంశము నిలుపుటకే వివాహంబు. ధర్మపత్నికి అన్యాయము చేయను. అదే ధర్మమైతే రాజ్యమునే విడుస్తాను కాని అధర్మముగా చరించను.. " ఇటువంటి సంభాషణలు రామారావుగారి నోటివెంట అలవోకగా సాగిపోతాయి. ధర్మంపట్ల నిశ్చయము. ఆయన జీవితం చివరి వరకు నిజజీవితంలో కూడా ఆచరింపబడింది. పాత్రలను నటించటమే కాదు. వాటి స్ఫూర్తి ప్రతిఫలించేలా జీవించారు వారు.

మాటవరసకన్న మాట పట్టుకుని విశ్వామిత్రుడు రాజ్యం కాజేసి కట్టు పుట్టాలతో హరిశ్చంద్రుని అడవికి పంపాడు. పాత అప్పుతో సహా ఆపై నక్షత్రకుడు పీడించడం. దారిలో అనేక బాధలు పడడం... నటన సహజంగానే వున్నా, నల్లబట్టలు ధరించటం నాటకంలోలాగా అయింది. నక్షత్రకుడిగా రమణారెడ్డిగారు న్యాయం చేసారు. దారిలో విశ్వామిత్రుడు అనేక రూపాల్లో హరిశ్చంద్రుని చేత అబద్ధమాడించాలని ప్రయత్నించి భంగపడతాడు. అగ్నిదేవుడి రూపంలో వశిష్టుడి రూపంలో వచ్చి ప్రలోభపెడతాడు. దేనికీ లొంగడు హరిశ్చంద్రుడు. చివరకు వారణాసి చేరుకుంటారు. 'హే చంద్రచూడ మదనాంతక శూల పాణే సాణో గిరీశమహేశశంభో.. ' పాట చిత్రానికే ఒక గొప్ప ఆకర్షణ. వరలక్ష్మిగారు ఘంటసాలగారు పాడిన ఈ పాట ఆబాలగోపాలం అందరిలో ప్రతిధ్వనించింది.

సత్యప్రతిష్ఠకోసం ఏం చేసినా తప్పుకాదు తన నమ్మేయమని ప్రోత్సహిస్తుంది చంద్రమతి. కలహకంఠి, కాలకౌశికులు బ్రాహ్మణ దంపతులు. ఈశ్వరుడు కాలకౌశికుని రూపంలో వచ్చి ధనం చెల్లించి ఈమెను, లోహితుడిని కొంటాడు. తరువాత నక్షత్రకుడి ఒత్తిడిమీద హరిశ్చంద్రుడు 'వీరబాహు' అనే కాటికాపరికి అమ్ముడుబోతాడు. 'కలలోనైనా నవ్వులకైనా ఏనాడు అనృతము పలకని అమృత చరిత.. ' ఈ పద్యం కరుణ రసార్ద్రం. ఈ పద్య సన్నివేశంలో రామారావుగారు తన భార్యను అమ్ముతున్నప్పుడు కలిగే బాధను బాగా వ్యక్తీకరించగలిగారు.

కానీ చూసే ప్రేక్షకుల్లో కరుణ రసం ఏర్పడదు. అదంతా పరీక్షే కదా అని అనుకోవటం కావచ్చు. జరగబోయేది ముందే తెలియటం వలనకావచ్చు. సన్నివేశ చిత్రీకరణలో బలంలేదు. అందుకే రసావిష్కరణలో సాఫల్యం పొందలేకపోయింది.

లోహితుడు చనిపోయాక కాటి దృశ్యంలో కలుసుకుంటారు భార్యాభర్తలు. ఈలోపు శ్మశానాన్ని చూసి హరిశ్చంద్రుడు వైరాగ్యం తెచ్చుకుంటాడు. కాటి కాపరి రూపం బాగా వచ్చింది. చక్రవర్తి స్థితినుండి పూర్తి మారురూపు తీసుకుని రాగలిగారు. ముఖం కూడా పూర్తిగా మారింది. భూత ప్రేతాల మధ్య అతడొక భూతంలాగా ఉంటాడు. శవాన్ని అనుమతి లేకుండా తగలబెడుతున్న చంద్రమతిని భార్యని గుర్తించక శవదహనం చేయొద్దంటాడు. తన దగ్గరేమీ లేదని పేదదాన్నని చెబుతుంది చంద్రమతి. ఒక మాడ, ఒక పాత, పిడికెడు బియ్యం తేవాలని లేకపోతే వెళ్ళిపొమ్మంటాడు. ఇంతలో ఆమె మెడలో మంగళసూత్రం మెరుస్తుంది. 'అమ్ముకొనరాదా నీ

మాంగల్యమున్' అని ఆయనంటే నా పతికి తప్ప వేరొకనికి కనిపించని నా మంగళసూత్రం కాటి కాపరికి కనిపించుటయా అంటూ ఆయనను గుర్తిస్తుంది. అలా భార్యాభర్తలు గుర్తుపట్టుకుంటారు. 'శాంతించుము దేవీ! అంతా విధి లీల. ఎవ్వరూ తప్పించలేర'ని భార్యకు హితవు చెప్పి మాడకోసం ఆమె యజమాని దగ్గరకు పంపిస్తాడు. చనిపోయిన తన పెద్దకొడుకు ఆ సమయంలో గుర్తొచ్చాడని రామారావుగారు చెప్పారు. కాశీరాజు కొడుకు మరణం అమాయకురాలైన చంద్రమతి మీదకు వస్తుంది. రాజువెనక ముందులాలోచించకుండా కాటికాపరిద్వారా ఆమెకు మరణదండన విధిస్తాడు.

ఈ సన్నివేశం అద్భుతంగా ఉంది. పతాక సన్నివేశం నిజంగా మనసును కదలించింది. చివరికి 'స్త్రీ హత్య కూడానా!' అని బాధపడతాడు హరిశ్చంద్రుడు. 'చంద్రమతి ప్రాణేశ్వరా! దైవసంకల్పం ఇలాగున్నప్పుడు మనమేం చెయ్యగలం. మీ బాధ్యత మీరు నిర్వర్తించండి.'

'సత్యధర్మము విడనాడనిదానివి. ఇంత ఘోరకృత్యము చేయుటయా దైవసంకల్పము, నిరపరాధివి, అయినను స్వామి యాజ్ఞ నెరవేరుస్తాను' అని నిష్కర్మయోగభావంతో దుఃఖాన్ని అణచుకుని, కర్తవ్యోన్ముఖుడవుతున్న సన్నివేశం హృదయాలను కదిలించేస్తుంది. ఇక్కడ ఆహార్యంలో కొంచెం లోపం జరిగింది. అదేమిటంటే ముఖాన్ని కొంత నలుపు చేశారు. కానీ తెల్లటి రామారావుగారి శరీరాన్ని అలాగే విడిచిపెట్టారు. దానివల్ల ఒకే వ్యక్తి రెండురంగుల్లో కనపడతారు. అయితే పాత్ర ఔచిత్యాన్ని బాగా పోషించారు.

భార్యకంఠం కత్తిరించబోయే దృశ్యంలో ఆయన ముఖంలో సర్వసంగపరిత్యాగమైన భావం కనిపిస్తుంది. అన్నిటికతీతుడుగా ఏం జరిగినా చలించని ధీరోద్ధతుడుగా ఇక ఏడుపే లేదు. అన్న నిర్లిప్తతా ధోరణిని చక్కగా ప్రతిఫలింపచేసారు. 'ఈ సత్యమార్గం నుండి నేను తొలగను. నా ధర్మం నన్ను ఆచరించనీ' అంటూ విశ్వామిత్రుడితో కఠినంగా చెబుతాడు. భార్యకంఠాన్ని నరుకుతాడు. అది పూలమాలగా మారి ఆమె మెళ్ళో పడుతుంది. ఈశ్వరుడు ప్రత్యక్షమవుతాడు. విశ్వామిత్రుడు తాను ఓడినట్లు ఒప్పుకుంటాడు. తన తపశ్శక్తిలో సగం అతని సత్యనిరతికి ధారపోస్తాడు. 'పదునాలుగు మన్వంతరముల వరకు ప్రకాశిస్తావు. ఇంద్రుడి అర్ధ సింహాసనమలంకరిస్తావు. సత్యమే శాశ్వతమని నిరూపించిన నీ కీర్తి ఆచంద్రతారార్కమ'ని శివుడు ఆశీర్వదిస్తాడు. లోహితుడు కాశీరాజు కుమారుడు బ్రతకటం మళ్ళీ రాజలాంఛనాలు అందరికీ రావటంతో కథ సమాప్తమవుతుంది. ప్రేక్షకులకు మాత్రం ఏ భావనా మిగల్లేదు.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments